రోడ్లపైనే వాహనాల పార్కింగ్

- మున్సిపాలిటీలో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్య
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

దేవరకొండ : దేవరకొండ పట్టణం మున్సిపాలిటీగా ఏర్పాటయ్యాక వ్యాపార, వాణిజ్యపరంగా రోజు రోజుకు దినదినాభివృద్ధి చెందుతుంది. దీంతో దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలు ,గ్రామాలకు చెందిన ఎంతో మంది నిత్యం వివిధ పనుల నిమిత్తం పట్టణానికి రోజూ రాకపోకలు కొనసాగిస్తుంటారు. దీంతో దేవరకొండ పట్టణంలోని ప్రధాన రహదారులు నిత్యం రద్దీగా మారుతున్నాయి. ఇదిలా ఉంటే ఆయా వాణిజ్య సముదాయాల వద్ద వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలాలు కరువు అవ్వడంతో వాహనదారులు తమ వాహనాలను ఇష్టానుసారంగా దుకాణాల ఎదుట రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తరుచూ ఇబ్బందులు

నిత్యం వందల సంఖ్యలో వాహనాలు దేవరకొండ ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగిస్తుండగా వివిధ పనుల నిమిత్తం దేవరకొండ పట్టణానికి వచ్చే వారితో పట్టణంలో నిత్యం రద్దీ వాతావరణం ఉంటుంది. పట్టణంలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తినప్పుడల్లా మున్సిపల్, పోలీసు అధికారులు హడావుడి చేయడం సర్వసాధారణమైపోయింది. పట్టణంలోని ఆయా వాణిజ్య సముదాయాల వద్ద పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో కాలినడకన వెళ్లే వారు సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రధానంగా పట్టణంలోని బస్టాండు, రహదారి బంగ్లా, విష్ణు కాంప్లెక్స్, చేనేత సహకార సంఘం, డిండి ఎక్స్‌రోడ్డు వంటి ప్రధాన ప్రాంతాల్లో వాహనాలను వాహనదారులు ఇష్టారాజ్యంగా నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీంతో కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను రోడ్లపై నిలిపే క్రమంలో పోలీసులు ఆన్‌లైన్ ద్వారా చాలానాలు విధిస్తుండడంతో వాహనదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. కాగా ఇప్పటికైనా పట్టణ పరిధిలోని ఆయా ప్రధాన వ్యాపార, వాణిజ్య సముదాయాల వద్ద వాహనాలకు అవసరమైన పార్కింగ్ స్థలాలను కేటాయించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



విష్ణు కాంప్లెక్స్ సమీపంలో రోడ్డుపై నిలిపిన వాహనాలు

ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం



దేవరకొండ పట్టణానికి వివిధ పనుల నిమిత్తం చుట్టు పక్కల నుంచి వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అందుకు అనుగుణంగానే వాహనాల రద్దీ సైతం పెరుగుతుంది. దీంతో పట్టణంలో కొంత మేర ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ప్రత్యేకంగా పట్టణంలోని ఆయా రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. వాహనదారులు, పట్టణ ప్రజలు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులకు సహకరించాలి.వాహనాలను ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటాం.

– నర్సింహులు, సీఐ, దేవరకొండ

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : మహిళల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిర్యాలగూడ మండలంతో పాటు అడవిదేవుపల్లి మండలాలకు చెందిన 41మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి పేదలను ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, తహసీల్దార్లు హరిబాబు, సురేష్‌కుమార్, ఆర్‌ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, కౌన్సిలర్లు గంధం రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు మంద సైదులు, గున్‌రెడ్డి బుచ్చిరెడ్డి, శ్రీనివాస్, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ : లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నడిపిస్తున్న ఎస్‌పీఆర్ ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాలను నడిపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాల ఫీజులను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఆంజనేయులు, మురళీకృష్ణ, లక్ష్మణ్, వెంకటేష్, అఖిల్, ఆకాష్, బాబురాం, రాజు, పాల్గొన్నారు.

దేవరకొండ : నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు యలమల గోపిచంద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ సంస్థ రూపొందించిన సిలబస్ కాకుండా సొంత సిలబస్ వాడటం చట్టాన్ని అతిక్రమించడమేనన్నారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

గోపాలమిత్రల పీఆర్‌సీ బకాయిల విడుదలపై హర్షం

వేములపల్లి : పశుగణాభివృద్ధి శాఖలో గోపాల మిత్రలు పీఆర్‌సీ బకాయిలు రూ.7.36కోట్లను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేయడం హర్షణీయమని గోపాలమిత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల యాదగిరి అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గోపాలమిత్రలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం వంద రోజుల్లో పీఆర్‌సీ బకాయిలను విడుదల చేసిందన్నారు. ఈ బకాయిల విడుదలకు సహకరించిన మంత్రులు భట్టి విక్రమార్కకు, జిల్లా మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు, గోపాల మిత్ర సర్వీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వేముల వీరేశానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

డిండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈనెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ బి.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆసక్తి ఉన్న విద్యార్థులు నాల్గొ తరగతి నుండి పదో తరగతి వరకు బోనోఫైడ్ సర్టిఫికెట్‌తో పాటు కుల ధ్రువీకరణ ఫొటో, మెయిల్ ఐడీ కలిగి ఉండి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. మిగతా వివరాలకు 9441237136 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విజ్ఞాన తరగతులను జయప్రదం చేయాలి



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో ఈనెల 25, 26తేదీల్లో నిర్వహించే కేవీపీఎస్ విజ్ఞాన తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. మంగళవారం స్థానికంగా తరగతులకు సంబంధించిన కరపత్రాలను ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. అట్టడుగున ఉన్న నిమ్నజాతులు సమగ్ర అభివృద్ధి చెందాలంటే సమాజంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గాదె నర్సింహ, బొల్లు రవీందర్, పుచ్చకాయల నర్సిరెడ్డి, కట్ట శ్రవణ్‌కుమార్, శివ, శ్రీనివాస్, సైదులు, మోహన్, పాల్గొన్నారు.

కుల గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి



జేసీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : బీసీ కులాల గణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ బీసీ సంఘాలు, బీఎల్‌ఎఫ్, పీఆర్‌పీఎస్, ఎంసీపీఐ నాయకులు మంగళవారం జేసీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు పెన్షనర్ల భవనంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు బీసీ కులగణన వెంటనే చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కె.పర్వతాలు, నూనె వెంకటస్వామి, వస్కుల మట్టయ్య, జనార్దన్‌గౌడ్, వంటిపాక యాదగిరి, చొల్లేటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ఘనంగా ఆకుపూజ



ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి మంగళవారం ఆకుపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యుసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓ వెంకటచలపతి, అర్చకులు ముడుంబై మనోహరాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విత్తన ధరల వివరాలు బోర్డుపై ప్రదర్శించాలి

మిర్యాలగూడ : ఫర్టిలైజర్ దుకాణదారులు తమ షాపు ఎదుట విత్తన ధరల వివరాలను బోర్డుపై ప్రదర్శించాలని ఏడీఏ నాగమణి అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఆమె సీపీలు, ఇన్వాయిస్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్మాలని, నాసిరకం విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన విత్తనాల దుకాణాదారుల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు. లాట్ నంబర్లు, విత్తన ప్యాకెట్ లేబుళ్లను చూసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఓ సరిత తదితరులు ఉన్నారు.



ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగమణి

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవూర : మండల కేంద్రంలోని గిరిజన బాలికల మినీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 30, రెండో తరగతిలో 05, మూడో తరగతిలో 02, నాలుగో తరగతిలో 03 చొప్పున ఖాళీలు ఉన్నాయని పెద్దవూర మండలానికి చెందిన వారు ఈనెల 18వ తేదీలోపు దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డ్, రెండు పాస్‌ఫొటోలు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందించాలని సూచించారు. అడ్మిషన్ ప్రక్రియను లాటరీ పద్ధతి ద్వారా ఈనెల 21న ఎంపికచేయనున్నట్లు తెలిపారు. మండలానికి చెందిన విద్యార్థులకు ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు యన పేర్కొన్నారు.

10జీపీఏ సాధించిన విద్యార్థినికి సన్మానం

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఇరాపురి అక్షర పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 10 జీపీఏ సాధించడంతో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో విద్యార్థినిని సత్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా హాజరయ్యారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ 10/10 సాధించినందుకు అక్షరను, పాఠశాల అధాపక బృంధాన్ని ప్రత్యేకంగా అభినందించారని పాఠశాల హెచ్‌ఎం ఎస్. విజయకుమారీ తెలిపారు. ఈ సందర్భంగా అక్షరను జిల్లా విద్యాధికారి భిక్షపతి, మండల విద్యాశాఖాధికారి మాలోతు బాలాజీనాయక్‌లు పాఠశాల బృందాన్ని ప్రశంసించారు.



విద్యార్థిని అక్షరను సన్మానిస్తున్న వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు

నేటి నుంచి మోగనున్న బడి గంట



నిడమనూరు ప్రాథమిక పాఠశాల ప్రహరీకి బొమ్మలు వేస్తున్న ఆర్టిస్టు

నిడమనూరు : ప్రభుత్వ పాఠశాలలు గురువారం తెరుచుకోనున్నాయి. వేసవి సెలువుల అనంతరం మళ్లీ ప్రభుత్వ , ప్రైవేట్ పాటశాలలు విద్యార్థులతో సందడిగా మారనున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి బడి బాట కార్యక్రమం చేపట్టారు. మండలంలో గురుకుల పాఠశాలలతో కలిపి 52 ప్రభుత్వ పాఠశాలలు, వాటిలో 4300 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు పంపిణీ చేయడానికి పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు ఇప్పటికే ఆయా పాఠశాలలకు చేర్చి సిద్ధంగా ఉంచారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్కూల్ ఫండ్‌తో గోడలకు సున్నాలు, రంగులు వేయగా, దాతలు ఇచ్చిన విరాళాలతో ఆకర్షణీయంగా బొమ్మలు వేస్తున్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి(చింతపల్లి) : చింతపల్లి మండలంలోని గుడితండాలోని శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవంలో మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్, చందునాయక్, వెంకటయ్యగౌడ్, కిన్నెర హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లింగమంతుల, సౌడమ్మ దేవాలయ అభివృద్ధికి కృషి

మిర్యాలగూడ : మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో నిర్వహించిన శ్రీ లింగమంతుల సౌడమ్మ తల్లి జాతరలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి తనవంతుగా ఎల్లవేళలా సహకరిస్తానన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు రాబట్టాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు రాబట్టాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, మోడల్, కస్తూరిబా, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూతబడిన పాఠశాలలకు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పూర్వ వైభవం తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ప్రహరీల నిర్మాణం, తాగునీటి వసతి తదితర మౌలిక సదుపాయాల కొరకు నిధులు మంజూరు చేయిస్తానని ఆయన తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బాలికల పాఠశాలలు, కళాశాలల వద్ద ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా పోలీసు శాఖకు సూచించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈవోలు మాతృనాయక్, సామ్యానాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య

మిర్యాలగూడ టౌన్ : మెరుగైన విద్య కావాలంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. ధర్మానాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని గాంధీనగర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కుర్ర కృష్ణాకాంత్‌నాయక్, జనార్దన్‌రెడ్డి, తావూర్య, పరశురాములు, అశ్విని, అనిత, జ్యోతి తదితరులున్నారు.

కొండమల్లేపల్లిలో బడిబాట

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని చింతచెట్టుతండా, పూల్‌సింగ్‌తండాతో పాటు పలు గ్రామాల్లో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత యూనిఫాం, మధ్యాహ్న భోజనంతో పాటు తదితర సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొర్ర లోక్యానాయక్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ తరిరాము అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఏకరూప దుస్తులు, నోట్‌బుక్‌లను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు అందించే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను స్థానిక ప్రజాప్రతినిధులు, అమ్మఆదర్శ పాఠశాలల ఛైర్మన్ల చేతులమీదుగా అందించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆంగ్లమాధ్యమంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఆయా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, పరమేష్, సత్యనారాయణ, సీఆర్‌పీ నాగయ్య పాల్గొన్నారు.



దేవరకొండ : సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్



కొండమల్లేపల్లి : బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



తిరుమలగిరి : హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందజేస్తున్న ఎంఈఓ



మిర్యాలగూడ టౌన్ : గాంధీనగర్‌లో..

భూములు కాపాడాలని ఆర్డీఓకు వినతి



ఆర్‌డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, దళితులు

హుజూర్‌నగర్ : నిరుపేదల భూములు కాపాడాలని మేళ్లచెరువు మండలం వేపలమాదారానికి చెందిన పలువురు దళితులు మంగళవారం హుజూర్‌నగర్‌లో ఆర్‌డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వేనంబర్ 141లో గల సుమారు 40 ఎకరాల భూమిని 60 కుటుంబాలకు చెందిన నిరుపేద దళితులు బాగు చేసుకుని సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఆ భూమిపై కన్నేసిన కొందరు పెద్దలు తమను బెదిరించి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. నిరుపేదలైన తమకు పట్టాలు ఇప్పించాలని ఆర్‌డీఓను వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు ప్రసాద్, బాలచంద్రుడు, రామారావు, శ్రీనివాసులు, నాగరాజు, రాణి, విశాఖ, నాగరాజు, నరేష్, స్వాతి, జయేంద్ర, గోపి, తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు చెక్

- అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా చర్యలు
- ఇంటింటికి వెళ్లి సభ్యుల వివరాల సేకరణ
- ఎన్‌హెచ్‌టీసీ యాప్‌లో నమోదు

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా లబ్ధిదారులు అందేలా ప్రభుత్వా ప్రత్యేకంగా సర్వేను చేపట్టింది. పాలు, గుడ్లు, బాలామృతం లబ్ధిదారులకు ఇవ్వకుండా రికార్డుల్లో రాసే విధానానికి చెక్ పెట్టేలా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. దీంతో పాటు తీవ్ర పోషకాహారం లోపం ఉన్న చిన్నారులను గుర్తించి ప్రతి నెలా బరువులు, ఎత్తులు వంటివి గమనిస్తున్నారు. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో «న్యూట్రీషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం(ఎన్‌హెచ్‌టీఎస్) పేరుతో సర్వేను మార్చి నెల నుంచి చేపడుతున్నారు. సేకరించిన వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో..

మున్సిపాలిటీలో 100, మిర్యాలగూడ మండలంలో 111 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటి పరిధిలో మొత్తం 0 నుంచి 6 ఏళ్ల పిల్లలు 8494 మంది ఉన్నారు. గర్భిణులు, బాలింతలు మొత్తం 1750మంది ఉన్నారు. అదే విధంగా దామరచర్ల ప్రాజెక్టు పరిధిలో వేములపల్లి, మాడుగులపల్లి, అడవిదేవులపల్లి, దామరచర్ల, త్రిపురారం మండలాల్లో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు 251 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటి పరిధిలో 0 నుంచి 6 ఏళ్ల పిల్లలు మొత్తం 8982 మంది ఉండగా గర్భిణీలు, బాలింతలు 1661 మంది ఉన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని టీచర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, మొబైల్‌లోని అప్లికేషన్‌లో పొందుపరుస్తున్నారు. ఇంటి యాజమానితో పాటు కుటుంబ సభ్యులు ఎంత మంది ఉన్నారు. వారి వయస్సు, ఆధార్ సంఖ్య, పుట్టిన తేది వంటి తదితర వివనాలను అంగన్‌వాడీ టీచర్లు తదితర వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేస్తున్నారు. సర్వేలో భాగంగా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులతో పాటు దివ్యాంగుల వివరాలను సైతం పొందుపరుస్తున్నారు.

ఎన్నికలతో సర్వే ఆలస్యం

ఈ సర్వేను మార్చులోనే ప్రారంభమైనప్పటికీ వరుసగా ఎన్నికలు రావడంతో పాటు అంగన్‌వాడీలు బీఎల్‌ఓలుగా విధులను నిర్వర్తిస్తుండటంతో కొంత జాప్యం చోటు చేసుకుంటుంది. ప్రస్తుతం ఈ సర్వే ముమ్మరంగా చేపడుతున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇవ్వాల్సిన పాలు, కోడిగుడ్లు, బాలమృతం వంటి పోషకాహారం పక్కదారి పట్టకుండా ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతోంది. . గర్భిణులు రెండు చోట్ల పౌష్టికాహారం తీసుకోకుండా సర్వేతో అడ్డుకట్ట పడుతుంది.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి బరువు పరిశీలిస్తున్న టీచర్

వంద శాతం పూర్తి చేస్తాం



న్యూట్రీషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం పేరుతో అంగన్‌వాడీ టీచర్లు చేపడుతున్న సర్వే ముమ్మరంగా సాగుతోంది. వందశాతం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. సర్వేలపై ఇప్పటికే అంగన్‌వాడీలకు సమన్వయ కర్తలతో శిక్షణ ఇచ్చాం. ఎప్పటికప్పుడు వారికి ఎదురయ్యే సందేహాలపై సమన్వయ కర్తలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

– మమత, సీడీపీఓ, మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు

సర్వేలో సమగ్ర సమాచారం నమోదు



అంగన్‌వాడీ టీచర్లు సర్వేలో ఉన్న పిల్లలందరికీ నాణ్యమైన ఎత్తు, బరువులను తీసి ఎన్‌హెచ్‌టీఎస్ యాప్ గుర్తించాలని, గుర్తించిన ఈ బరువులు ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5 డెటాతో సమానంగా, సమగ్రంగా నమోదు అయ్యే విధంగా చూస్తున్నాం. ప్రాజెక్టు పరిధిలోని వేగవంతంగా సర్వే జరుగుతుంది.

– ఎస్. చంద్రకళ, సీడీపీఓ, దామరచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

హుజూర్‌నగర్ : సైబర్ మోసాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ చరమందరాజు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు నమ్మించి మీ వివరాలు సేకరించి వాటి ద్వారా మీ పేరు మీద సిమ్ కార్డు, బ్యాంక్ అక్కౌంట్ తీసుకొని ఆన్‌లైన్ మోసాలు చేస్తారని తెలిపారు. హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలో 51 కేసుల్లో దాదాపు రూ.96 లక్షలు పోగొట్టుకున్నారని చెప్పారు. బాధితులు సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కాల్ చేయడంతో బ్యాంకుల్లో నగదను ఫ్రీజ్ చేయడం జరిగిందని తెలిపారు. కోర్టు ఉత్తర్వుల మేరకు రూ.26 లక్షల రికవరీ చేసినట్లు ఆయన వివరించారు.

మేలైన పత్తి విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

రామగిరి(నల్లగొండ) : పత్తి సాగులో మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని తిప్పర్తి మండల వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో నల్లగొండ, తిప్పర్తి, కనగల్ రైతులకు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సాంద్రత పత్తి సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, సేంద్రియ వ్యవసాయంపై శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తిప్పర్తి మండల వ్యవసాయ అధికారి సన్నీరాజ్, ఏఈఓ సంతోషి, లక్ష్మీనారాయణ, రజిత, గోపి, కనగల్, నల్లగొండ మండలాల ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.